



## అంజన్న ఆలయంలో తలనీలాల సేకరణకు టెండర్లు



హైదరాబాద్‌లో తలనీలాల టెండర్ నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, సెప్టెంబర్ 30: కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునేందుకు హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఈ-టెండర్ కమ్ సీల్డ్ కమ్ బహిరంగ వేలం టెండర్ ప్రక్రియను నిర్వహించారు. 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూలై 31 వరకు ఏడాది కాలానికిగాను తలనీలాలు పోగు చేసుకునేందుకు ఆరు సంస్థలు పాల్గొనగా, వారిలో కెవిఎన్ ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా రూ.1.76 కోట్లు పాటపాడి ముందంజలో నిలిచింది. అయితే గతేడాదితో చూస్తే ధర తక్కువగా ఉండడంతో తుది నిర్ణయం కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు నివేదించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. టెండర్ ప్రక్రియలో ఈవో రామకృష్ణారావు, ఏఈవో అంజయ్య, అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ, సూపరింటెండెంట్లు సునీల్, నీల చంద్రశేఖర్, సెక్షన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వర్‌రావు ఉన్నారు.

## విరమణ పోలీసులకు సన్మానం



విరమణ పోలీసులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎస్పీ, అధికారులు

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 30: ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సన్మానించారు. షీ టీం విభాగంలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వలీబేగ్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య సోమవారం ఉద్యోగ విరమణ చేయగా, వారిని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీతో పాటు పలువురు పోలీసు అధికారులు సత్కరించారు. బ్యాండు మేళాల మధ్య పోలీసు వాహనం ఎక్కించి వారిని ఇంటి వద్ద దింపి, ఘన వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావు, ఆర్ఐ కిరణ్, వేణు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 30: యూసుఫ్‌నగర్ గ్రామశివారులో కోడి పందాలు ఆడుతున్న వారిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులో కోడిపందాలు ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకోగా మరికొందరు పారిపోయారు. వారి వద్ద నుంచి రూ.10,500 నగదు, ఐదు కోళ్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు వివరించారు.

# బతుకమ్మ సంబురం

- మహిళా డిగ్రీ కాలేజీలో ముందస్తు వేడుకలు
- పాల్గొన్న ప్రముఖులు



బతుకమ్మలతో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, మహిళలు

జగిత్యాల, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, ప్రముఖ వైద్య నిపుణులు సీపీడీసీ సెక్రటరీ జి శ్రీలత, కౌన్సిలర్లు చుక్కా నవీన్, లావణ్య, రేణుక పాల్గొని ఆటపాటలతో విద్యార్థినులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ దేవతలను పూలతో పూజిస్తే, ఆ పూలనే పూజించి గౌరవించే సంస్కృతి మన తెలంగాణలోనే ఉందన్నారు. ఇది ఒక విశిష్టమైన సాంస్కృతిక వారసత్వ పండుగ అని పేర్కొన్నారు. జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి సింగిడి లాంటిది బతుకమ్మ అని అభివర్ణించారు. బతుకమ్మ సంబురాలలో మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త వాసవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీస్ అధికారులు సంగీతారాణి, సుజాత, జీ శ్రీలత, అధ్యాపకులు డాక్టర్ జమున, సునీత, జ్యోత్స్న, సమత, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, డాక్టర్ ప్రమోద్ కుమార్, రహీం, డాక్టర్ వరప్రసాద్ బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థినులు ఉన్నారు.

# కోరుట్ల బల్దియా సమావేశం రసాభాస

- అభివృద్ధి నిధుల కేటాయింపుపై వివక్ష చూపుతున్నారంటూ విపక్ష సభ్యుల నిరసన
- ఎజెండా నుంచి పలు అంశాలు తొలగించాలని డిమాండ్
- అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్రవాగ్వాదం

కోరుట్ల, సెప్టెంబర్ 30: కోరుట్ల మున్సిపల్ సమావేశం రసాభాసగా మారింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించగా, ముందుగా అధికారులు వివిధ అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపుల ఆమోదం కోసం 15 అంశాలతో ఎజెండాను ప్రవేశపెట్టారు. పలు పనులకు నిధుల కేటాయింపు అంశంపై ప్రతిపక్ష కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్ల వార్డుల్లో మాత్రమే అభివృద్ధి పనుల కోసం 14వ ఆర్థిక సంఘం నిధులను ఒక్కో వార్డుకు రూ.1.70 లక్షలు కేటాయించడంపై మున్సిపల్ చైర్‌పర్సన్‌తో వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు చెందిన కౌన్సిలర్ల వార్డులకు నిధులు ఎందుకు కేటాయించడం లేదో చెప్పాలని ఆందోళన చేశారు. దీంతో మున్సిపల్ సమావేశంలో గందరగోళం నెలకొంది. విపక్ష, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచి, సమావేశం ముగిసింది. సమావేశంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, కమిషనర్ తిరుపతి, టీపీవో ప్రవీణ్ కుమార్, జేఏవో శివకుమార్, టీపీఎస్ రమ్య, ఏఈలు పాల్గొన్నారు.

**మున్సిపల్ చైర్‌పర్సన్‌ది ద్వంద్వ వైఖరి: విపక్ష కౌన్సిలర్లు**

పట్టణంలోని విపక్ష కౌన్సిలర్ల వార్డులకు నిధుల కేటాయింపులో మున్సిపల్ చైర్‌పర్సన్ వివక్ష చూపుతున్నారని, ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నారని బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో పలు వార్డుల్లో అంతర్గత రహదారుల నిర్మాణం కోసం అభివృద్ధి నిధులు కేటాయించారని, ఇప్పుడు ఎలాంటి ఆక్షేపణలు లేకున్నా రద్దు చేయడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోతుందన్నారు. అభివృద్ధి పనుల కోసం నిధులు లేవని చెబుతున్న అధికారులు, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహ ఏర్పాటుకు రూ.21 లక్షల ప్రజా ధనాన్ని వినియోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ మంత్రిపై తమకు అభిమానం ఉందని ప్రజాధనంతో విగ్రహ ఏర్పాటు సరికాదన్నారు. రత్నాకర్‌రావు విగ్రహ ఏర్పాటుకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సొంతంగా రూ.10 లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రజా ధనాన్ని వృథా చేయవద్దని బీఆర్ఎస్ కౌన్సిలర్లు హితవు పలికారు. తాము కూడా మాజీ మంత్రి విగ్రహ ఏర్పాటుకు విరాళాలు సేకరించి నిర్మాణానికి సహకరిస్తామని బీజేపీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ముజాఫర్ అహ్మద్, ములుమూరి అలేఖ్య, బట్టు రాధిక, పోగుల ఉమారాణి, పేర్ల సత్యం, మాడవేణి నరేష్, పెండెం గణేశ్, నాయకులు బట్టు సునీల్, బాబా, అన్వర్, ఫహీం, సనావొద్దీన్, అతిక్, మురళి తదితరులున్నారు.



కోరుట్ల: మున్సిపల్ చైర్‌పర్సన్‌తో వాగ్వాదానికి దిగిన విపక్ష కౌన్సిలర్లు

### నిధుల కేటాయింపులో వివక్ష చూపడం సరికాదు

- సాధారణ నిధులు పట్టణాభివృద్ధికి వినియోగించాలి
- మాజీ మంత్రి రత్నాకర్ విగ్రహ నిర్మాణానికి సొంత నిధులు అందిస్తా
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, సెప్టెంబర్ 30: మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులను కాంగ్రెస్‌కు చెందిన 20 మంది కౌన్సిలర్ల వార్డులకు మాత్రమే కేటాయించి, విపక్ష కౌన్సిలర్ల వార్డులను విస్మరించడంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తప్పుపట్టారు. జనరల్ ఫండ్ నిధులు కోరుట్ల ప్రజల హక్కు అని, వాటిని అన్ని వార్డులకు సమానంగా కేటాయించకుండా ద్వంద్వనీతి అవలంభించడం సరికాదన్నారు. అభివృద్ధి పనులకు అన్ని వార్డుల్లో ఖర్చు చేయడానికి నిధులు లేవు కానీ, రాజకీయ నాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి రూ.21 లక్షలు నిధులు ఎలా కేటాయించారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పట్టణాభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదని, ఇప్పుడే తొలిసారి ఇచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. పట్టణంలో రోడ్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పారిశుధ్య కార్మికులకు జీతాలు సరైన టైంలో చెల్లించే పరిస్థితి లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహ ఏర్పాటుకు తన సొంత నిధులు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. పన్నుల ద్వారా వసూలు చేసిన డబ్బులు ప్రజలకే ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఎజెండాలోని 2, 14వ అంశాలను రద్దు చేయాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## జగిత్యాల కలెక్టర్‌కు కేంద్రమంత్రి సంజయ్ లేఖ

మల్యాల, సెప్టెంబర్ 30: కొండగట్టు అంజన్న దేవస్థాన భూములకు హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చొరవచూపాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ సోమవారం లేఖ రాశారు. అలాగే ప్రతి పౌర్ణమిని పురస్కరించుకొని చేపట్టే గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక దారిని ఏర్పాటు చేయించాలని, కొండగట్టు దిగువన ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

## నృసింహుడి సన్నిధిలో రవాణా శాఖ ఉప కమిషనర్

ధర్మపురి, సెప్టెంబర్ 30: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామిని సోమవారం తెలంగాణ రవాణా శాఖ ఉప కమిషనర్ చిదుర రమేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున అధికారులు ఆయనకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం ఇచ్చి సన్మానించారు. ఇక్కడ దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, అర్చకులు నంభి నరసింహ మూర్తి ఉన్నారు.

## మెట్‌పల్లిలో బస్ షెడ్ నిర్మాణంపై రగడ

మారుతీనగర్, సెప్టెంబర్ 30: మెట్‌పల్లి పట్టణంలోని పాతబస్టాండ్ వెల్లల్లరోడ్ వద్ద బస్‌షెడ్ నిర్మాణం వివాదాస్పదంగా మారుతున్నది. సోమవారం మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్ ఉద్యోగులు, బీఆర్ఎస్ శ్రేణులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య రగడ జరిగింది. వివరాల్లోకి వెళితే.. కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు వర్గీయులు మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు జ్ఞాపకార్థం బస్‌షెడ్ నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో ఆ స్థలం మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్‌ది కావడంతో ఖాదీ ఉద్యోగులు, బీఆర్ఎస్ శ్రేణులు అడ్డు చెప్పారు. ఇక్కడ ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకే తాము బస్‌షెడ్ నిర్మిస్తున్నామని కాంగ్రెస్ వర్గీయులు పేర్కొనగా, ఖాదీ చైర్మన్ వచ్చేదాకా నిర్మాణం చేపట్టవద్దని బీఆర్ఎస్ శ్రేణులతో పాటు ఖాదీ ఉద్యోగులు కాంగ్రెస్ శ్రేణులతో వాగ్వాదానికి దిగారు. కాసేపు ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడగా, మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అయినప్పటికీ కాంగ్రెస్ శ్రేణులు బస్‌షెడ్ పనులు కొనసాగించారు. సంఘటనా స్థలాన్ని టీపీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించి నిర్మాణంపై అనుమతులు లేవని తేల్చి చెప్పారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## తల్లిదండ్రులూ.. మేల్కోండి

చిన్నారులకు, మైనర్లకు వాహనాలివ్వొద్దని పోలీసులు అవగాహనలు కల్పిస్తూన్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. తమ పిల్లలు వాహనాలు నడుపుతున్నారని సంబుర పడుతున్నారే తప్పా ప్రమాదాలపై ఆలోచించడం లేదు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని జడ్పీహైస్కూల్ చిన్నారులు ముగ్గురు స్కూటీపై చక్కర్లు కొట్టారు. వేగంగా పట్టణమంతా కలియదిరుగగా, ప్రమాదాలు జరుగక ముందే తల్లిదండ్రులు మేల్కోవాల్సి ఉంది.

– మారుతీనగర్, సెప్టెంబర్ 30